
# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 32 | పేజీలు: 4 | వెల: 4/- | మంగళవారం ● 20, ఆగస్టు 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## 370 ఆర్టికల్‌ను పునరుద్దరిస్తాం

◆ ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించిన నేషనల్ కాన్ఫరెన్స్



**శ్రీనగర్,ఆగస్ట్19(నమస్తే ఉదయం):** జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల నగారా మోగడంతో రాజకీయ సందడి మొదలయ్యింది. ఈ అసెంబ్లీ ఎన్నికలు మూడు విడతలుగా జరగనున్నాయి. ఈ నేపథ్యంలో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ ఉపాధ్యక్షుడు, మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా సోమవారం శ్రీనగర్‌లో తమ పార్టీ మేనిఫెస్టోను విడుదల చేశారు. ఆర్టికల్ 370తోపాటు 35ఏని పునరుద్దరిస్తామని ఆయన స్పష్టం చేశారు. వీటితోపాటు మరో 10 అంశాలను మేనిఫెస్టో జాబితాలో పొందు పరిచారు. ప్రజా భద్రత చట్టాన్ని రద్దు చేస్తామన్నారు. అలాగే రాజకీయ ఖైదీలను విడుదల చేస్తామని తెలిపారు. భారత్, పాక్ మధ్య నిలిచిపోయిన చర్చలను పునరుద్దరిస్తామని పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుక బడిన మహిళలకు ఏడాదికి 12 గ్యాస్ సిలెండర్లు అందజేస్తామన్నారు. అలాగే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాశ్మీర్ పండిట్లకు పూర్వ వైభవం తీసుకు వస్తామని తెలిపారు.

## సోదరుడు నరసింహ్మారెడ్డికి రాఖీ కట్టిన సబితా ఇంద్రారెడ్డి



**రాజేంద్రనగర్,ఆగస్టు 19(నమస్తే ఉదయం):** రాఖీ పౌర్ణమి సందర్భంగా మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి సోదరుడు నరసింహ్మా రెడ్డి ఇంటికెళ్లి రాఖీ కట్టారు. సోదర, సోదరీమణుల ఆత్మీయ అనుబంధానికి రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. అక్కా-తమ్ముళ్ల,అన్న-చెల్లెళ్ళ వెల కట్టలేని ప్రేమానురాగాలు, ఆప్యాయతలకు ఈ పండుగ నిదర్శనంగా నిలుస్తుందని చెప్పారు.ప్రతి ఇంట సంతోషాలు వెల్లివిరిసే రక్ష బంధన్‌ను కుటుంబసభ్యుల మధ్య ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని సబితా ఇంద్రారెడ్డి ఆకాంక్షించారు. మంత్రి ప్రజలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అక్క తమ్ముళ్ల, అన్న చెల్లెల అనుబంధానికి, ప్రేమ, ఆప్యాయతలకు, అనురాగాలకు రక్ష బంధన్ నిదర్శనంగా నిలుస్తుందన్నారు.



సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి రాఖీ కడుతున్న మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎ.సదాలక్ష్మి



ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు రాఖీ కడుతున్న ఎ. సదాలక్ష్మి

## సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కలకు రాఖీ కట్టిన మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కుమారి ఏ సదాలక్ష్మి

**హైదరాబాద్, ఆగస్టు19(నమస్తే ఉదయం):** రాఖి పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క లకు సచివాలయంలోని వారి చాంబర్లలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, రాజేంద్రనగర్‌కు చెందిన ఎ.సదాలక్ష్మి మిగతా.. 2లో

## ప్రధాని మోడీకి రాఖీ కట్టిన చిన్నారులు



**న్యూఢిల్లీ, ఆగస్ట్19(నమస్తే ఉదయం):** దేశవ్యాప్తంగా రాఖీ పౌర్ణమి పండుగను ఘనంగా జరుపుకున్నారు.. రక్షా బంధన్‌ను పురస్కరించుకుని ప్రధానమంత్రి నరంద్రమోడీకి చిన్నారులు రాఖీ కట్టారు. సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో పలు పాఠశాలల విద్యార్థులతో కలిసి రక్షా బంధన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

ఈ సందర్భంగా బాలికలతో ప్రధాని మోడీ ప్రత్యేకంగా మాట్లాడారు.. వారితో కలిసి సరదాగా పండుగను జరుపుకున్నారు. ప్రధాని మోడీకి చిన్నారులు రంగురంగుల రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. సందర్భంగా ప్రధాని మోడీ.. రాఖీ వేడుకలకు సంబంధించిన చిత్రాలను, వీడియోలను ఎక్స్ లో షేర్ చేశారు.. తన యువ స్నేహితులతో కలిసి రక్షా బంధన్‌ని జరుపుకున్నందుకు సంతోషంగా ఉందంటూ.. ప్రధాని మోడీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.





## రాష్ట్ర వ్యాప్తంగా రాఖీ పండుగ సంబురాలు

- సిఎం రేవంత్‌కు రాఖీ కట్టిన సీతక్క తదితరులు
- కెటిఆర్‌కు రాఖీ కట్టిన బిఆర్ఎస్ మహిళా నేతలు
- చెల్లెలు కవితతో అనుబంధాన్ని గుర్తు చేసుకున్న కెటిఆర్
- మహిళలకు అండగా ఉంటానన్న ఎమ్మెల్యే హరీష్ రావు

**హైదరాబాద్,ఆగస్ట్19(నమస్తే ఉదయం):** రాష్ట్ర వ్యాప్తంగా రాఖీ పండుగ సంబురాలు ఘనంగా కొనసాగాయి. జూబ్లీహిల్స్‌లో నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి సీతక్కతో పాటు పలువురు రాఖీ కట్టారు. రాఖీ పౌర్ణమి పర్వదినం సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి సీతక్క రాఖీ కట్టారు. సీతక్కతో పాటు ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు పర్ణిక రెడ్డి, రాగమయి, కార్పొరేషన్ చైర్మన్లు బండ్రు శోభారాణి, మిగతా.. 2లో



## రుణమాఫీ కాలేదంటే.. అరెస్ట్ చేస్తారా..?

- కడుపు మండి ఆందోళన చేస్తే అరెస్ట్‌లా
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ హరీష్ రావు

**హైదరాబాద్,ఆగస్ట్19(నమస్తే ఉదయం):** రుణమాఫీ కాలేదన్న రైతులను అరెస్టులు చేస్తారా అని ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజాపాలన అని ప్రచారం చేసుకుంటూ అప్రజాస్వామిక విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించడం సిగ్గుచేటని విమర్శించారు. రుణమాఫీ కాలేదని అదిలాబాద్ జిల్లా తలమడుగులో నిరసన తెలియచేస్తున్న రైతులను అరెస్టులు చేయడం హేయమైన చర్య అన్నారు. పోలీసు యాక్ట్ (30 ంఇబి) పేరు చెప్పి, జిల్లాలో నిరసనలు, ఆందోళనలు చేయొద్దని పోలీసులు హుకుం జారీ చేయడం హక్కులను కాలరాయడమేనని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా శాంతియుతంగా నిరసన తెలియ చేస్తున్న రైతులను ముందస్తుగా అదుపులోకి తీసుకుంటున్నారని, అరెస్టులు చేస్తున్నారని వెల్లడించారు. ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరిని బీఆర్ఎస్ పార్టీ పక్షాన తీవ్రంగా మిగతా.. 2లో

## దేశ క్రీడారంగానికి కేంద్ర బిందువుగా తెలంగాణ

- స్పోర్ట్స్ యూనివర్సిటీలో ప్రతి క్రీడకు ప్రాధాన్యం
- క్రీడాకారులను గుర్తించి ప్రోత్సాహక శిక్షణ ఇవ్వాలి
- యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ సిఎం రేవంత్ సమీక్ష





**హైదరాబాద్,ఆగస్ట్19(నమస్తే ఉదయం):** దేశ క్రీడారంగానికి కేంద్ర బిందువుగా తెలంగాణ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఇందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ యూనివర్సిటీపై ఆయన వారితో చర్చించారు. ఫోర్త్ సిటీలో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏవిధంగా ఉండాలనే దానిపై పలు సూచనలు చేశారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో ప్రతి క్రీడకు ప్రాధాన్యం ఉండాలని, అన్ని రకాల క్రీడలను, క్రీడా శిక్షణ సంస్థలను ఒకే గొడుగు కిందకు తేవడమే స్పోర్ట్స్ యూనివర్సిటీ లక్ష్యమన్నారు. మన దేశంతో పాటు తెలంగాణలోని భౌగోళిక పరిస్థితులు, మన శారీర నిర్మాణ తీరుకు అనువైన క్రీడలు ఏవో గుర్తించి, క్రీడలపై ఉత్సాహం ఉన్న వారిని గుర్తించి వారిని ఆయా క్రీడల్లో మిగతా.. 2లో

## 'ధరణి' సమస్యలకు త్వరలో చరమగీతం

- దేశానికి ఆదర్శంగా ఉండేలా కొత్త రెవెన్యూ చట్టం
- 'రెవెన్యూ'ను కంటికి రెప్పలా కాపాడుకుంటాం
- కొత్త రెవెన్యూ చట్టం ముసాయిదా చర్చాగోష్టిలో మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, ఆగస్ట్19(నమస్తే ఉదయం):** గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక పెద్దమనిషి, ఒక ఉన్నతాధికారి కలిసి కుట్రపూరితంగా రాత్రికి రాత్రి తీసుకువచ్చిన ధరణి పోర్టల్ వల్ల తెలంగాణ ప్రజలు అనుభవిస్తున్న కష్టాలకు, బాధలకు త్వరలోనే చరమగీతం పాడబోతున్నామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల మిగతా.. 2లో

## రూ.5వేల కోట్లతో 120 గురుకుల పాఠశాల భవనాలు

- స్థలాల ఎంపిక..డిజైన్లు పూర్తి చేయాలి
- అధికారులతో సమీక్షలో డిప్యూటి సిఎం భట్టి



**హైదరాబాద్,ఆగస్ట్19(నమస్తే ఉదయం):** తెలంగాణ వ్యాప్తంగా ఈ ఏడాది రూ.5వేల కోట్లతో 30 ప్రాంతాల్లో 120 గురుకుల పాఠశాల భవనాలు నిర్మించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సమీకృత గురుకుల సముదాయాల కోసం నియోజకవర్గాల్లో స్థలాలు, డిజైన్ల ఎంపిక వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మిగతా.. 2లో



## రాజ్యసభ అభ్యర్థిగా సింఘ్వీ నామినేషన్

- కార్యక్రమంలో పాల్గొన్న సిఎం రేవంత్ మంత్రులు

**హైదరాబాద్,ఆగస్ట్19(నమస్తే ఉదయం):** కాంగ్రెస్ తరపున రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీ నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ పాల్గొన్నారు. రాజ్యసభలో తొమ్మిది రాష్ట్రాలకు చెందిన 12 స్థానాలకు సెప్టెంబరు 3న ఉప ఎన్నికలు మిగతా.. 2లో



## తెలంగాణకు రాజీవ్‌కు ఏం సంబంధం

- సచివాలయం ఎదురు విగ్రహాన్ని ఆమోదించం
- బిఆర్ఎస్ అధికారంలోకి రాగానే తొలగిస్తాం
- విమానాశ్రయం తదితర పేర్లు కూడా మార్చేస్తాం
- కాంగ్రెస్ నిర్ణయంపై మండిపడ్డ బిఆర్ఎస్ నేత కెటిఆర్

**హైదరాబాద్,ఆగస్టు19(నమస్తే ఉదయం):** తెలంగాణ సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడమంటే తెలంగాణ ఆత్మ గౌరవంపై దాడి చేసినట్లేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. అక్కడ తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలనుకున్నట్లు వెల్లడించారు. రాఖీ వేడుకల్లో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ మిగతా.. 2లో




## వైద్యురాలి హత్యాచార కేసు

- నిందితుడికి లై డిటెక్టర్ పరీక్షకు అనుమతి

**కోల్‌కతా,ఆగస్ట్19(నమస్తే ఉదయం):** శ్చిమబెంగాల్‌లో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అరెస్టయిన నిందితుడు సంజయ్ రాయ్‌కు పాలిగ్రాఫ్/లై డిటెక్టర్ పరీక్ష నిర్వహించేందుకు కలకత్తా హైకోర్టు అనుమతినిచ్చింది. ఈ మేరకు సీబీఐ వర్గాలు సోమవారం వెల్లడించాయి. మంగళవారం అతడికి ఈ పాలిగ్రాఫ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు సమాచారం. ఆగస్టు 9న వెలుగులోకి వచ్చిన ఈ దారుణం దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ మిగతా.. 2లో

# వైద్యురాలి హత్యాచార కేసు

(మొదటి పేజీ తరువాయి)

మెడికల్ కాలేజీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆ జూనియర్ వైద్యురాలు ఆగస్టు 8వ తేదీ రాత్రి విధుల్లో ఉన్న సమయంలో ఈ అఘాయిత్యం జరిగింది. ఈ ఘటనలో సివిక్ వాలంటరీ సంజయ్ రాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళన వ్యక్తమవడంతో కేసును సీబీఐకి అప్పగిస్తూ ఆగస్టు 13న కలకత్తా హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అదే సమయంలో ఆమెపై సామూహిక అత్యాచారం జరిగి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. లేదా నిందితుడి వెనుక ఎవరైనా ఉండి ఉంటారనే వార్తలు వినిపించాయి. ఈ క్రమంలోనే నిజానిజాలు తెలుసుకునేందుకు సంజయ్ రాయ్‌కు పాలిగ్రాఫ్ పరీక్ష నిర్వహించేందుకు అనుమతి నివ్వాలని న్యాయస్థానానికి సీబీఐ కోరింది. తాజాగా అందుకు అంగీకరించిన కోర్టు.. కేసు తదుపరి విచారణను ఆగస్టు 29వ తేదీకి వాయిదా వేసింది.

# తెలంగాణకు రాజీవ్‌కు ఏం సంబంధం..?

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం నిర్ణయాలపై మండిపడ్డారు. రాజకీయాల్లో అధికారం, పదవులు శాశ్వతం కాదన్నారు. రాష్ట్ర ఆత్మగౌరవాన్ని చాటేలా కేసీఆర్ సచివాలయాన్ని కడితే.. కాంగ్రెస్ సర్కారు రాజీవ్ విగ్రహం చేయడమేంటని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని.. తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట రాజీవ్‌గాంధీ విగ్రహం పెడుతున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణకు, రాజీవ్‌కు ఏం సంబంధం ఉందని ప్రశ్నించారు. వందలమంది ప్రాణాలు తీసిన నాయకుడి విగ్రహం పెడతారా ? నిలదీశారు. తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడం దారుణమన్నారు. ప్రస్తుతం విగ్రహాన్ని పెట్టినా బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే తొలగించి తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తామని తేల్చి చెప్పారు. అలాగే, రాష్ట్రంలో రాజీవ్ పేరుతో ఉన్న రింగ్ రోడ్డు, హైదరాబాద్ విమానాశ్రయం సహా ఇతర సంస్థల పేర్లను సైతం మారుస్తామని కేటీఆర్ హెచ్చరించారు. తెలంగాణలో ఇందిరా గాంధీ, రాజీవ్ పేర్లతో హైదరాబాద్‌లో చాలానే ఉన్నాయన్న కేటీఆర్.. కాంగ్రెస్ ఇప్పటికైనా మారకుంటే అధికారంలోకి వచ్చాక మారుస్తామని తేల్చిచెప్పారు. ఇప్పటికైనా కాంగ్రెస్ మనసు మార్చుకుని అక్కడ తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి రాజీవ్ గాంధీ విగ్రహాన్ని గాంధీ భవన్‌లో పెట్టుకో లేకపోతే జూబ్లీహిల్స్‌లో లేదంటే.. ఇంట్లో పెట్టుకోవాలన్నారు. అంతేగానీ తెలంగాణ తల్లిని అవమానిస్తే ఊరుకోమన్నారు.

# రుణమాఫీ కాలేదంటే.. అరెస్ట్ చేస్తారా..?

(మొదటి పేజీ తరువాయి)

ఖండిస్తున్నామన్నారు. రైతులు రుణమాఫీ కాకపోవడంతో కలెక్టరేట్లు, వ్యవసాయ కార్యాలయం, బ్యాంకుల చుట్టూ తిరిగి విసిగి వేసారి పోతున్నారని చెప్పారు. ఏం చేయాలో తెలియక చివరకు రోడెక్కి ఆందోళన చేస్తున్నారని తెలిపారు. అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తున్నదని వెల్లడించారు. ప్రభుత్వం రైతుల రుణమాఫీ సమస్యకు పరిష్కారం చూపకుండా, పోలీసులను పురమాయించి గొంతెత్తిన వారిని బెదిరించడం, అణగదొక్కే ప్రయత్నం చేయడం దుర్మార్గమని విమర్శించారు. ఒకవైపు రైతుబంధు రాక, మరోవైపు రుణమాఫీ కాక అన్నదాత ఆవేదనలో ఉన్నాడని చెప్పారు. వ్యవసాయ పనులు చేసుకోవాలా లేక రుణమాఫీ కోసం ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేయాలా అంటూ కన్నీరు పెట్టుకుంటున్నారని వెల్లడించారు. ఏకకాలంలో ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఆచరణలో మాత్రం అట్టర్ ఎలాప్ అయ్యారని ఎద్దేవాచేశారు. నమ్మి ఓటేసినందుకు రైతన్నను నట్టేట ముంచారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. ఎద్దు ఏడ్చిన ఎవుసం, రైతు ఏడ్చిన రాజ్యం ఏనాడూ బాగుపడ్డట్లు చరిత్రలో లేదన్న విషయాన్ని కాంగ్రెస్ పాలకులు మరిచిపోయి నట్లున్నారని చెప్పారు. ఇప్పటికైనా కండ్లుతెరిచి రైతులందరికీ రుణమాఫీ చేయాలని, ఆందోళనలో ఉన్న రైతాంగానికి భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని మరోసారి డిమాండ్ చేశారు. అదిలాబాద్ సహా ఇతర జిల్లాల్లో రైతన్నలపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేదంటే అరెస్టు చేసిన రైతన్నలకు అండగా బీఆర్ఎస్ పార్టీ కార్యచరణ ప్రకటిస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# రాష్ట్ర వ్యాప్తంగా రాఖీ పండుగ సంబురాలు

(మొదటి పేజీ తరువాయి)

నెరేళ్ల శారద, కాల్వ సుజాత, తదితరులు రేవంత్ రెడ్డికి రాఖీలు కట్టారు. తనకు రాఖీలు కట్టిన మహిళా నేతలకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. సోదరీ సోదరుల మధ్య అనురాగాలకు, ఆప్యాయతలకు ప్రతీక రాఖీ పండుగ అని మంత్రి సీతక్క అన్నారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. రాఖీ పండగ సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మాయిలను గౌరవించుకోవాల్సిన అవసరాన్ని రాఖీ పండుగ చాటి చెబుతుందన్నారు. మహిళా భద్రతకు పాటుపడదామని రాఖీ పండుగ సందర్భంగా అందరూ ప్రతినభూనాలన్నారు. మహిళలను గౌరవించు కోవడం మన సంస్కృతి అని అన్నారు. ప్రతి అడపడుచు, అన్నదమ్ములతో ఎంతో ఉత్సాహాన్ని, ఆనందాన్ని పంచుకునే పండగ రాఖీ పండగ అని అన్నారు. సోదరులు అందరూ బాగుండాలని ప్రతి ఆడబిడ్డ కోరుకుంటుందని తెలిపారు. సమాజంలో వస్తున్న రకరకాల మార్పులు వల్ల మహిళల పట్ల అనేక రకాల హింస జరుగుతుందన్నారు. ప్రతి సోదరుడు తన సోదరికి సమాజంలో ఎలా సెక్యూరిటీ, గౌరవం పొందాలి అనుకుంటారో.. అలాగే ప్రతి ఒక్కరూ తమ అక్క చెల్లమ్మల మాదిరి సమాజంలో ప్రతి ఆడబిడ్డను గౌరవించాలని అన్నారు. ప్రతి మహిళను మన ఇంటి బిడ్డగా చూస్తే అఘాయిత్యాలు, అత్యాచారాలు జరగవన్నారు. ఆడబిడ్డలకు స్వేచ్ఛగా తిరేగే అవకాశం ఇద్దాం.. ఎదగనిద్దాం అంటూ అందరికీ రాఖి పండగ శుభాకాంక్షలు తెలిపారు. సీఎంకు కూడా రాఖీ కట్టి పండగ శుభాకాంక్షలు తెలిపానని.. చాలా సంతోషంగా ఉందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఇకపోతే తెలంగాణ భవన్‌లో రాఖీ పండుగ సంబురాలు ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మహిళా నేతలు రాఖీ కట్టారు. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే కోవా లక్ష్మి, మాజీ విప్ గొంగిడి సునీత, ఇతర నేతలు కేటీఆర్‌కు రాఖీ కట్టి హారతిపట్టారు. మాజీ మంత్రి సత్యవతి.. అక్షింతలు వేసి కేటీఆర్‌ను ఆశీర్వదించారు. రాఖీ పండుగ సందర్భంగా దేశవ్యాప్తంగా ఘనంగా వేడుకలు జరుపుకుంటున్నారు. సాధారణ ప్రజలతోపాటు సినీ, రాజకీయ, వ్యాపార ప్రముఖులు కూడా రాఖీ వేడుకలు జరుపుకుంటున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. జైల్లో ఉన్న తన సోదరి కల్వకుంట్ల కవిత ను ఉద్దేశించి తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఆవేదనతో కూడిన పోస్ట్ చేశారు. తన సోదరి కవిత ఈ రోజు తనకు రాఖీ కట్టలేకపోవచ్చునని, కానీ ఆమెకు ఏ కష్టమొచ్చినా తాను ఎల్లవేలలా అండగా ఉంటానని కేటీఆర్ పేర్కొన్నారు. 'ఈ రోజు నువ్వు రాఖీ కట్టలేకపోవచ్చు. కానీ నీకు కష్టమొచ్చినా నేను అండగా ఉంటా' అని ఆయన పోస్ట్ చేశారు. ఈ పోస్ట్‌కు లవ్ సింబల్‌ను జతచేశారు. గతంలో సోదరి కవిత తనకు రాఖీ కట్టిన ఫొటోను షేర్ చేశారు. బీఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నివాసంలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. పార్టీ మహిళా నేతలు హరీశ్‌రావుకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. రాఖీలు కట్టిన సోదరీమణులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. అన్నా చెÑలలెళ్ల బంధానికి ప్రతీక రాఖీ పండుగ అని చెప్పారు. పండుగను అందరూ ప్రేమ, అభిమానాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. మహిళల శ్రేయస్సు, భద్రత కోసం కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# రాజ్యసభ అభ్యర్థిగా సింఘ్వీ నామినేషన్

(మొదటి పేజీ తరువాయి)

జరగనున్నాయి. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాజ్యసభ సభ్యులు పీయూష్ గోయల్, సర్బానంద సోనోవాల్, జ్యోతిరాదిత్య సింధియా, కామఖ్య ప్రసాద్, వివేక్ ఠాకుర్, రాజేభోస్లే, బిప్లబ్ కుమార్ దేబ్(భాజపా), మీసా భారతి(ఆర్జేడీ), దీపేంద్రసింగ్ హుడా, కె.సి.వేణుగోపాల్(కాంగ్రెస్) లోక్‌సభకు ఎన్నికయ్యారు. వారంతా రాజ్యసభ సభ్యత్వాలకు రాజీనామా చేశారు. ఒడిశాలో బీజేడీ ఎంపీ



మమతా మొహంత తన పదవికి, పార్టీకి రాజీనామా చేశారు. తెలంగాణ నుంచి భారాస రాజ్యసభ సభ్యుడిగా ఉన్న కె.కేశవరావు సైతం కాంగ్రెస్‌లో చేరి పదవికి రాజీనామా చేశారు. దాంతో ఈ 12 ఖాళీలకు ఉప ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 21వ తేదీ వరకు నామినేషన్ల దాఖలుకు గడువు ఉంది. ఈ మేరకు తెలంగాణ నుంచి తమ అభ్యర్థిగా అభిషేక్ సింఘ్వీని కాంగ్రెస్ అధిష్ఠానం ఖరారు చేసింది. సుదీర్ఘకాలంగా ఆయన పార్టీకి సేవలందిస్తున్నారు. 2001 నుంచి కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధిగా పనిచేస్తున్నారు. రెండు దఫాలు(2006, 2018)గా రాజ్యసభ సభ్యుడిగా కొనసాగారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో హిమాచల్‌ప్రదేశ్ నుంచి పోటీచేసి భాజపా చేతిలో ఓడిపోయారు. తెలంగాణ నుంచి రాజ్యసభ సభ్యత్వం కోసం స్థానిక నాయకులు కొందరు ప్రయత్నించినా... జాతీయ రాజకీయాల్లో సింఘ్వీ సేవలు కాంగ్రెస్‌కు కీలకమైనందున ఆయన్నే అభ్యర్థిగా ఖరారు చేసినట్లు పార్టీ నేతలు వివరించారు. తెలంగాణలో కే కేశవరావు తమ పదవులకు, పార్టీలకు రాజీనామాలు చేశారు. దాంతో దేశవ్యాప్తంగా మొత్తం 12 రాజ్యసభ స్థానాలకు ఖాళీలు ఏర్పడ్డాయి.

ఈ ఖాళీ స్థానాలకు సెప్టెంబర్ 3న ఎన్నికలు జరగనున్నాయి. అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేసేందుకు ఈ నెల 21 వరకు గడువు ఇచ్చారు. ఈ క్రమంలో తెలంగాణ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా అభిషేక్ మనుసింఘ్వీని రంగంలోకి దించారు. దాంతో ఇవాళ ఆయన నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ దాఖలుకు ముందు ఆయన అసెంబ్లీకి వెళ్లారు. అక్కడ తెలంగాణ మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సింఘ్వీకి స్వాగతం పలికారు. ఆయన మెడలో పూలమాల వేసి, కాంగ్రెస్ కండువా కప్పి సత్కరించారు.

# దేశ క్రీడారంగానికి కేంద్ర బిందువుగా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దశాబ్దాల క్రితమే ఆఫ్రో-ఏషియన్ గేమ్స్, కామన్‌వెల్త్ గేమ్స్‌కు ఆతిథ్యమిచ్చిన హైదరాబాద్‌ను భవిష్యత్తులో ఒలింపిక్స్‌కు వేదికగా మార్చాలని ముఖ్యమంత్రి అన్నారు. హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహించడమే కాకుండా ప్రతి క్రీడలో మన క్రీడాకారులు పతకాలు దక్కేలా వారిని తీర్చి దిద్దాలని, అందులో మన స్పోర్ట్స్ యూనివర్సిటీ క్రీడాకారులు కచ్చితంగా ఉండాల్సిదేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇందుకోసం వారికి నిపుణులైన శిక్షకులతో శిక్షణ ఇప్పించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లోని క్రీడా విభాగాలు, ప్రభుత్వ ఆధ్వర్యంలోని క్రీడా పాఠశాలలు, అకాడమీలు, క్రీడా శిక్షణ సంస్థలు అన్నింటిని స్పోర్ట్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. స్పోర్ట్స్ యూనివర్సిటీలో మన దేశ క్రీడాకారులు ఒలింపిక్స్‌లో రాణించే షూటింగ్, రెజ్లింగ్, బాక్సింగ్, అర్చరీ, జావెలిన్ త్రో, హాకీకి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, ఆ తర్వాత శిక్షణ ద్వారా పతకాలు సాధించే అవకాశాలు ఉన్న క్రీడల్లో శిక్షణ ఇప్పించాలని సూచించారు. యూనివర్సిటీలో ఆయా క్రీడల్లో శిక్షణకు అవసరమైన వసతులు, ఆహారంతో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో తీర్చి దిద్దాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ÷న్నతనంలోనే విద్యార్థుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాలు, వారికి ఏ క్రీడలపై మక్కువ ఉందో ఉపాధ్యాయులు గుర్తించాలని ముఖ్యమంత్రి సూచించారు. అటువంటి విద్యార్థులందరికీ ఆయా క్రీడల్లో శిక్షణ ఇచ్చేలా ప్రతి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఒక స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేయాలన్నారు. ఆ పాఠశాలల్లో విద్యా బోధనతో ఉంటుందని అయితే క్రీడలకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని, విద్యార్థులకు అక్కడ వారికి నచ్చిన క్రీడల్లో శిక్షణ ఇచ్చి, ప్రతిభ ఆధారంగా వారికి స్పోర్ట్స్ యూనివర్సిటీలో వసతి కల్పించి మరింత పదును తేలేలా శిక్షణ ఇప్పించాలన్నారు.. హైదరాబాద్‌లోని స్పోర్ట్స్ యూనివర్సిటీ దేశా క్రీడా రంగానికి కేంద్ర బిందువుగా ఉండాలని, అందుకోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇటీవల ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన దేశాలు, క్రీడాకారుల వివరాలను సేకరించి, ఆయా క్రీడాకారులు పతకాల సాధనకు శ్రమించిన తీరు, ఆయా దేశాలు వారిని ప్రోత్సహించిన తీరు, వారికి ఇచ్చిన శిక్షణ, ప్రోత్సాహం తదితరాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఇప్పటికే స్కిల్ యూనివర్సిటీకి యంగ్ ఇండియా పేరు పెట్టామని, స్పోర్ట్స్ యూనివర్సిటీ యంగ్ ఇండియా పేరు ఖరారు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు యంగ్ ఇండియా పేరు పెడతామని ముఖ్యమంత్రి వెల్లడించారు. తెలంగాణ యంగ్ ఇండియాకు బ్రాండ్‌గా మారాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. క్రీడా నైపుణ్యాల్లో తెలంగాణ ఒక శక్తిమంతమైన రాష్ట్రంగా గుర్తింపు పొందడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.



మాస్టర్ కే.శ్రీహరి, కోచ్ రామేశ్వరీ, కోచ్ సుధీర్ కుమార్

# వరల్డ్ తైక్వాండో మాస్టర్ యూనియన్ కోర్సులో పాల్గొననున్న తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ..మాస్టర్ కే.శ్రీహరి

గద్వాల,ఆగస్టు19(నమస్తే ఉదయం): ఈనెల ఆగస్టు 21 నుండి 26 వరకు స్పోర్ట్స్ కాంప్లెక్స్ రాంచి జార్ఖండ్ రాష్ట్రంలో వరల్డ్ తైక్వాండో మాస్టర్ యూనియన్ వారి ఆధ్వర్యంలో తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి సౌజన్యంతో జరుగు కుక్కి వన్ ఇంటర్నేషనల్ మాస్టర్ కోర్స్‌లో తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మాస్టర్ కె.శ్రీహరి, గద్వాల్‌కి చెందిన కోచ్ రామేశ్వరి మరియు ఐజకు చెందిన కోచ్ సుధీర్ కుమార్‌లు పాల్గొననున్నారు. కొరియా దేశం నుండి వచ్చిన వరల్డ్ తైక్వాండో మాస్టర్ యూనియన్ గ్రాండ్ మాస్టర్‌కి హాంగ్ కిమ్ ఈ కార్యక్రమంలో పాల్గొని దేశవ్యాప్తంగా ఈ కోర్సులో పాల్గొనే మాస్టర్స్ కు మరియు కోచ్ లకు తైక్వాండోలు నూతన టెక్నిక్స్ మరియు నైపుణ్యాలపై తర్ఫీదు ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా వారికి క్రీడాకారులు, జిల్లా వాసులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# టీజేఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ కోదండరాంను సన్మానించిన ఎన్‌ఎసి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

హైదరాబాద్, ఆగస్ట్ 19(నమస్తే ఉదయం): తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీగా నియమితులైన సందర్భంగా ఎన్‌సి ఎంప్లాయిస్ యూనియన్ నాయ



ఎమ్మెల్సీ కోదండరాంకు శాలువాతో సత్కరించి పుష్ప గుచ్ఛం అందజేస్తున్న నాయకులు

కులు కోదండరాం స్వగృహానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆయన ఇంటి వద్ద నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ యూనియన్ నాయకులు మర్రి కృష్ణారెడ్డి, బాలకృష్ణ చారి, శ్రీనివాస్, అన్వేష్, రాము తదితరులు పాల్గొని సన్మానించారు.

# సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కలకు రాఖీ కట్టిన మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కుమారి ఏ సదాలక్ష్మి

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం రాఖీలు కట్టారు. తెలంగాణ రాష్ట్రంలోని అక్క చెల్లెలందరికి రక్షగా ఉండాలని ఆమె కోరారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రతినిధులతో కలిసి ఆమె రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలు మహిళా కాంగ్రెస్ కు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా తల్లులకు అండగా ఉండి వారి ఆర్థిక, సామాజిక భద్రతకు పెద్దపీట వేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు.

# రూ.5వేల కోట్లతో 120 గురుకుల పాఠశాల భవనాలు

(మొదటి పేజీ తరువాయి)

సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం సమీక్ష నిర్వహించారు. గురుకులాల ఏర్పాటుకు గ్రామీణ ప్రాంతాల్లో 15 నుంచి 25 ఎకరాలు, పట్టణాల్లో 10 నుంచి 15 ఎకరాల భూమి సేకరించాలన్నారు. గురుకులాల్లో అవసరమైన సదుపాయాలపై ఈ నెల 29లోగా నివేదిక సమర్పించాలని విద్యాశాఖను ఆదేశించారు. ఈ సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా పాల్గొన్నారు. విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ రెండో విడత నిధులను వెంటనే విడుదల చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ వినతిపై డిప్యూటీ సీఎం భట్టి సానుకూలంగా స్పందించారు. పెండింగులో స్కాలర్‌షిప్ బకాయిల జాబితా ఇవ్వాలని అధికారులకు తెలిపారు. నిర్ణీత గడువులోగా ఓవర్సీస్ స్కాలర్‌షిప్ నిధులను విడుదల చేయించుకునే బాధ్యత అధికారులదేనని చెప్పారు.

# మోడీ ఉక్రెయిన్ పర్యటన ఖరారు


## 23న కీవ్‌ను సందర్శించనున్న ప్రధాని

న్యూఢిల్లీ,ఆగస్ట్19(నమస్తే ఉదయం): రష్యా దండయాత్రతో గత రెండేళ్లకు పైగా యుద్ధ భూమిలో నలిగిపోతున్న ఉక్రెయిన్‌లో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటన ఖరారైంది. ఆగస్టు 23న ఆయన కీవ్‌ను సందర్శిస్తారని కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది. ఇది ఎంతో ప్రాధాన్యత కలిగిన పర్యటన అని తెలిపింది. ఉక్రెయిన్‌లో వివాదం పరిష్కరించేందుకు భారత్ ఎల్లప్పుడూ దౌత్యం, చర్చలను సమర్థిస్తుందని స్పష్టం చేసింది. ఆగస్టు 23న ప్రధాని మోదీ ఉక్రెయిన్ దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీతో భేటీ కానున్నారు. ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న యుద్ధం అంశంపైనా ఇరువురు నేతలు చర్చించనున్నారు. ఉక్రెయిన్ కంటే ముందు ప్రధాని పోలండ్‌లో పర్యటించనున్నారు. 2022లో ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్య తర్వాత ప్రధాని మోదీ కీవ్ పర్యటనకు వెళ్లడం ఇదే తొలిసారి. ఇటీవల ఇటలీ వేదికగా జరిగిన జీ7 శిఖరాగ్ర సదస్సులో భాగంగా మోదీ, జెలెన్‌స్కీ భేటీ అయిన విషయం తెలిసిందే. భారత్‌లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధించిన మోదీకి ఉక్రెయిన్ అధ్యక్షుడు ఫోన్ చేసి అభినందించారు. తీరిక చేసుకొని ఉక్రెయిన్‌లో పర్యటించాల్సిందిగా మోదీని కోరగా.. తాజాగా మోదీ కీవ్ పర్యటనకు వెళ్లనుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

# 'ధరణి' సమస్యలకు త్వరలో చరమగీతం

(మొదటి పేజీ తరువాయి)

శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. రైతులకు ఏ భూమి చిక్కులు కూడా లేకుండా చేసే ఆదర్శవంతమైన నూతన రెవెన్యూ చట్టం - 2024ను తీసుకువస్తున్నామని ప్రకటించారు. ఇందిరమ్మ రాజ్యంలో రైతు సుభిక్షంగా ఉండాలన్నదే మా ప్రభుత్వం లక్ష్యమన్నారు. నూతన రెవెన్యూ చట్టం



ముసాయిదాపై సోమవారం టూరిజం ప్లాజాలో తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసి యేషన్ (ట్రెసా) ఏర్పాటు చేసిన చర్చావేదిక కార్య క్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మంత్రి ప్రసంగించారు.

"చట్టాలు సరిగ్గా చేయకపోతే, వాటి ఫలితాలు ఎలా ఉంటాయో గత ప్రభుత్వం తీసుకువచ్చిన 2020 రెవెన్యూ చట్టమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. గతంలో మాదిరిగా జరగకుండా ఉండడానికి ఒక రోజు ఆలస్యం అయినా కూడా ఉన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు భవిష్యత్తు తరాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేలా చట్టాన్ని రూపొందిస్తున్నాం. సామాన్యుని నుంచి మేధావి వరకు అన్నీ వర్గాల అభిప్రాయాలను తీసుకోవడానికి ముసాయిదా చట్టాన్ని పబ్లిక్ డొమైన్ లో పెట్టడంతో పాటు ఇటువంటి చర్చావేదికలను కూడా ఏర్పాటు చేస్తున్నాం. మార్పు కావాలని తెలంగాణ ప్రజానీకం కోరుకున్నారో ఆ మార్పుకు ధరణి నాంది పలికింది. మనం భౌతికంగా ఉన్నా లేకున్నా అధికారంలో ఉన్నా లేకున్నా మనం తీసుకొచ్చిన చట్టాలు పదిమందికి ఉపయోగపడేలా శాశ్వతంగా ఉండేలా రూపొందించాలి. ఆ దిశగా మా ప్రభుత్వం ముందుకు వెళ్తుంది.

రెవెన్యూ వ్యవస్థను కంటికి రెప్పలా కాపాడే విషయంలో మాకు స్పష్టత ఉంది. రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థను తీసుకువస్తామని అలాగే రెవెన్యూ కోర్టులను కూడా ఏర్పాటు చేస్తాం. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేస్తాం. అలాగే రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కార విషయంలో సానుకూలంగా వ్యవహరిస్తాం. త్వరలోనే రెవెన్యూ ఉద్యోగ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేస్తాం. ఈ ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్న ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి ఇద్దరే పని చేస్తే సాధ్యం కాదు, రెవెన్యూ ఉద్యోగులందరూ సమిష్టిగా, నిబద్ధత, జవాబుదారీతనంతో పనిచేస్తేనే సాధ్యమవుతుంది" అని అన్నారు.

# సిఎం సిద్ధరామయ్యకు తాత్కాలిక ఉపశమనం

## ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశం

బెంగళూరు,ఆగస్ట్19(నమస్తే ఉదయం): కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు హైకోర్టులో తాత్కాలిక ఉపశమనం లభించింది. ఆగస్ట్ 29వ తేదీ వరకు ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ట్రయిల్ కోర్టును కర్ణాటక హైకోర్టు ఆదేశించింది. ముడా కుంభకోణంలో సీఎం సిద్ధరామయ్యను ప్రాసిక్యూషన్ చేసేందుకు ఆ రాష్ట్ర గవర్నర్ తవర్‌చంద్ గెహ్లాత్ అనుమతి ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు. గవర్నర్ ఆదేశాలను నిలిపి వేయాలంటూ సీఎం సిద్ధరామయ్య సోమవారం హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ రిట్ పిటిషన్‌పై సింగిల్ బెంచ్ జడ్జి హేమంత్ చందన్‌గౌడ్ ఆధ్వర్యంలో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సీఎం సిద్ధరామయ్య తరపు న్యాయవాదీ అభిషేక్ మను సింఘ్వీ తన వాదనలను వినిపించారు.

ఆ క్రమంలో ఆగస్ట్ 29వ తేదీ వరకు సీఎం సిద్ధరామయ్యను ఎలాంటి విచారణ జరపవద్దని న్యాయమూర్తికి వివరిం చారు. దీంతో న్యాయవాది సింఘ్వీ వాదనలతో సింగిల్ జడ్జి జస్టిస్ హేమంత్ చందన గౌడ్ ఏకీభవించారు. దీంతో ఆగస్ట్ 29వ తేదీ వరకు ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. మైసూర్ నగరాభివృద్ధి సంస్థ (ముడా) కుంభకోణంలో సీఎం సిద్ధరామయ్య ప్రమేయం ఉందంటూ.. సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ, టీజే అబ్రహం తదితరులు.. ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో సీఎం సిద్ధరామయ్యను ప్రాసిక్యూషన్ చేసేందుకు ప్రత్యేక కోర్టుకు గవర్నర్ తావర్ చంద్ గెహ్లాత్ ఆగస్ట్ 17వ తేదీన అనుమతి ఇస్తూ.. ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలను వెంటనే రద్దు చేయాలంటూ సిఎం సిద్ధరాయమ్య..



సోమవారం హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు.

ఈ రిట్ పిటిషన్‌ను సోమవారం సింగిల్ జడ్జి జస్టిస్ హేమంత్ చందన్ గౌడ్ విచారించారు. సీఎం సిద్ధరామయ్యను ఆగస్ట్ 29వ తేదీ వరకు ప్రాసిక్యూషన్ చేయకూడదంటూ సింగిల్ జడ్జి జస్టిస్ హేమంత్ చందన్ గౌడ్ ఆదేశించారు. దీంతో సీఎం సిద్ధరామయ్యనకు తాత్కాలిక ఉపశమనం లభించినట్లు అయింది.

# సోదరుడు శ్రీధర్‌కు రాఖీ కట్టిన అక్క శోభారాణి

**రాజేంద్రనగర్, ఆగస్టు19(నమస్తే ఉదయం):** రాఖీ పౌర్ణమి సందర్భంగా సోమవారం బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై. శ్రీధర్‌కు కరీంనగర్ పెద్దపల్లి నుండి వచ్చిన అక్క టి.శోభా రాణి రాఖీ కట్టారు.


శోభారాణి చాలా సంవత్సరాల తర్వాత తమ్మునికి రాఖీ కట్టారు. ప్రతీ సంవత్సరం పోస్ట్‌లో రాఖీలు పంపించే సోదరీ ఈ సంవత్సరం స్వయంగా రావడం చాలా సంతోషం అని శ్రీధర్ అన్నారు. మా ఇంట్లో అంతా పండుగ వాతావరణం ఏర్ప డిందని, మా అన్న వై.హరగోపాల్‌కు మా తమ్ముడు వై.రామకృష్ణకు సైతం రాఖీ కట్టిందన్నారు. శోభా రాణి సోదరులకు రాఖీ కట్టి మంగళ హారతులతో ఆశీర్వదించి మిఠాయిలు తినిపించింది. మా చెల్లి ఎం కుసుమ కుమారి పంపించిన రాఖీలు కూడా కట్టుకోవడం జరిగిందని శ్రీధర్ తెలిపారు.



బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్‌కు ఆయన అక్క కరీంనగర్ పెద్దపల్లికి చెందిన టి.శోభారాణి

# ప్రమాద బీమా చెక్కు అందజేత

**కొత్తకోట,ఆగస్టు 19(నమస్తే ఉదయం):** కొత్తకోట మండలం కనిమెట్ట గ్రామంలో బి ఆర్ఎస్ పార్టీ కార్యకర్త వెంకటేష్ గత కొన్ని రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో మరణించాడు. టిఆర్ఎస్ ప్రమాద బీమా ఇన్సూరెన్స్ ను దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి 2 లక్షల చెక్కును సోమవారం కనిమెట్ట గ్రామంలోని



కార్యకర్త ఇంటికి వెళ్లి తన చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ... బి ఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు ఏ ఆపదనైనా ఆదుకునే దిశగా పార్టీ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలుపాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం

**కొత్తకోట,ఆగస్టు 19( నమస్తే ఉదయం):** కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో సోమవారం ఫోటోగ్రఫీ డే సందర్భంగా పట్టణ ఫోటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ సభ్యులు ఫోటో కెమెరా సృష్టికర్త లూయిస్ టకురే చిత్రపటానికి పూలమాల




ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఫోటోగ్రాఫర్స్

వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్ ,పండ్లు, అందజేశారు. అనంతరం పట్టణ చౌరస్తాలో బాణాసంచా కాల్చి స్వీట్స్ పంచిపెట్టి ప్రజలకు ఫోటోగ్రఫీ శు భాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్ వంశీ శీను మాట్లా డుతూ ప్రపంచంలోనే తెలియని విషయాన్ని ఒక ఫోటో,వీడియో ద్వారా తెలుసుకోవచ్చని అన్నారు. ఫోటో వృత్తి చాలా గౌరమైన ఉన్నతమైన వృత్తి అని గడిచిన జ్ఞాపకాలను గుర్తుకు చేసేది, ఫోటో ద్వారానే అని చెప్పారు. ఈ కార్య క్రమంలో అధ్యక్షుడు అంజన్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వి బాలరాజ్, ఉపాధ్యక్షుడు గోపాల్, సలాం, ముజీబ్,సామ్రాట్,చిన్న నాగన్న, గోవర్ధన్, రాములు,రాజు,స్వామి, అంజి, భూపాల్, అల్లావుద్దీన్ శ్రీనివాస్ రెడ్డి శేషు ఉస్మాన్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# కోల్‌కత్తా వైద్య విద్యార్థిని మమిత హత్యకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీతో నిరసన

## చార్మినార్ వద్ద బెంగాలీ సమితి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

**చార్మినార్, ఆగస్టు19(నమస్తే ఉదయం):** కోల్ కత్తా ఆర్ జికర్ మెడికల్ కళాశాల పీజీ వైద్య రాలి హత్యా ఘటనకు నిరసనగా సోమవారం తెలంగాణ బెంగాలీ సమితి తెలంగాణ బెంగల సమితి ప్రెసిడెంట్ దీపాంకర్ పాల్‌తో పాటు మంజీరా నస్కర్‌ల ఆధ్వర్యంలో బెంగాలీలు




కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తూ నిరసన వ్యక్తం చేశారు. బెంగాలీ రాష్ట్రానికి చెందిన 14 సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో చార్మినార్ పరిసర ప్రాంతాలలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తూ ఘటనకు సంంధించిన దోషులను కఠినంగా శిక్షించాలని పలువురు బెంగాలీ సంఘాల ప్రతి నిధులు డిమాండ్ చేశారు.



రాజేంద్రనగర్ డిసిపి చింతమనేని శ్రీనివాస్‌కు రాఖీ కడుతున్న బిజెపి రాష్ట్ర నాయకురాలు కొమిరెడ్డి ఉమామహేశ్వర్ రెడ్డి



డిప్యూటీ కమిషనర్ కే.రవికుమార్ కు రాఖీ కడుతున్న ఉమామహేశ్వర్ రెడ్డి



సీనియర్ జర్నలిస్ట్ ఏ భీమయ్యకు రాఖీ కడుతున్న బిజెపి రాష్ట్ర నాయకురాలు కె ఉమామహేశ్వరి రెడ్డి

# ఇంటింటా 'రక్షా బంధన్'

- సోదరభావానికి ప్రతీక రాఖీ పౌర్ణమి..
- అన్నదమ్ముళ్లకు రాఖీలు కట్టిన సోదరీమణులు..
- రాఖీలు కట్టిన బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకురాలు ఉమామహేశ్వరి రెడ్డి

**రాజేంద్రనగర్,ఆగస్టు 19(నమస్తే ఉదయం):** సోదరభావానికి ప్రతీకగా నిలిచే రక్షా బంధన్ వేడుకలను ఆదివారం రాజేంద్రనగర్ నియోజకవర్గం వ్యాప్తంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా అక్కా చెల్లెళ్లు అన్నదమ్ములకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించి వేడుకలు చేసుకున్నారు.అలాగే, ప్రజా ప్రతినిధులకు మహిళలు రాఖీలు కట్టి ఆత్మీయతను చాటారు. రాజేంద్రనగర్ డిసిపి చింతమేని శ్రీనివాస్, రాజేంద్ర నగర్ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్,రాజేంద్రనగర్ సీనియర్ జర్నలిస్టులు అప్పరెడ్డిగూడెం భీమయ్య,మేకల దామోదర్ రెడ్డ,బాబురావులకు బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకురాలు, జనహిత వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ ఉమామహేశ్వరి రెడ్డి రాఖీలు కట్టి ఆశీర్వదించారు.మహిళా సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.సోదర సోదరీమణుల మధ్య అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ అని,రాష్ట్ర ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని రాజేంద్రనగర్ డిసిపి చింతమనేని శ్రీనివాస్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.అందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.రాఖీ పౌర్ణమిని అందరూ ఆనందోత్సాహాలతో సంతోషంగా జరుపుకోవాలని డిసిపి తెలిపారు. రాఖీ పండుగ సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో పండుగ వాతావరణం నెలకొంది.ఆర్టీసీ బస్సులు మహిళలతో కిక్కిరిసిపోయాయి.

# రాఖీ పండుగ మన ధర్మాన్ని గుర్తు చేస్తుంది..

**ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు..**
**ఆత్మీయతను చాటిన ఆడపడుచులు..**
**రాజేంద్రనగర్ నియోజకవర్గం సీనియర్ బిజెపి నాయకులు శీలం తిరుపతి రెడ్డి**

**రాజేంద్రనగర్,ఆగస్టు19(నమస్తే ఉదయం):** అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పౌర్ణమి వేడుకలు ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ప్రజలంతా ఘనంగా జరుపుకొన్నారు. పండుగను పురస్కరించుకుని ఆడపడుచులు అన్నదమ్ములకు రాఖీలు కట్టి తమ ఆత్మీయతను చాటుకున్నారు.పుట్టింటి నుంచి మెట్టినింటికి వెళ్లిన చెల్లెళ్లు అన్నలకు,తమ్ముళ్లకు రాఖీలు కట్టి ఈ బంధం జన్మజన్మలు కొనసాగాలని ఆశీర్వాదం పొందారు.రాఖీలు కట్టిన తమ అక్కా చెల్లెళ్లకు అన్నదమ్ములు నూతన వస్త్రాలు,కానుకలు సమర్పించి ఆనవాయితీని చాటుకున్నారు.ఈ సందర్భంగా సంతోషంగా ఉండాలని దీవించారు.చిన్నారులు కూడా ఒకరికొక్కరు రాఖీని కట్టుకొని తమ అనుబంధాన్ని చాటారు.

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో రాఖీ వేడుకలు కన్నుల పండువగా కొనసాగాయి.రాజేంద్రనగర్ నియోజకవర్గం సీనియర్ బిజెపి నాయకులు శీలం తిరుపతి రెడ్డికి ఆయన సోదరి రాఖీ కట్టారు.అన్నకు చెల్లి అండగా చెల్లికి అన్న తోడుగా



జీవితాంతం ఉంటామని భరోసాను ఇస్తూ రాఖీలు కట్టి చెల్లెలు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా

బిజెపి నాయకులు శీలం తిరుపతిరెడ్డి

మాట్లాడుతూ... అన్నాచెల్లెల, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తున్నదన్నారు.తన సోదరి రాఖీ కట్టడం ఆనందంగా ఉందని తెలిపారు. దేశ సంప్రదాయనికి, ఐకమత్యానికి,అన్నా చెల్లెల అనుబంధానికి,రాఖీ ప్రతీకగా నిలుస్తుందిని తెలిపారు.మన దేశ సనాతన ధర్మాన్ని ప్రతి బింబించడంతో పాటు జాతిని ఒకటి చేసే పండుగల్లో ఒకటైన రాఖీ పండుగ అన్నారు.



అక్కా చెల్లెల్లు,అన్నదమ్ముల ప్రేమానురాగాల బంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగ రోజు అక్కా చెల్లెల్లు పుట్టింటికి వచ్చి అన్నదమ్ములకు రాఖీలు కట్టి, మిఠాయిలు తీనిపించుకొని ఆత్మీయ బంధాన్ని చాటుకున్నారు.

# వైభవంగా వెంకటగిరి స్వామి కళ్యాణం

**కొత్తకోట, ఆగస్ట్ 19(నమస్తే ఉదయం):** కొత్తకోట పట్టణ సమీపంలోవెంకటగిరి క్షేత్రంలో వెలిసిన శ్రీ భూలక్ష్మి వెంకటేశ్వర స్వామి కళ్యాణం వైభోగంగా శ్రావణ మాసంలో శ్రావణ నక్షత్రం రోజు నిర్వహించారు. పూజల అనంతరం అమ్మవారికి మంత్రోచ్ఛరణల మధ్య మేళ తాళాలతో స్వామివారి కళ్యాణం సోమ వారం అంగరంగ వైభవంగా జరిగింది.

భక్తులు శోభయమానంగా తిలకించి కళ్యాణ మండపంలో ప్రత్యేక పూజలు నిర్వ హించారు. కళ్యాణోత్సవంలో జిలకర బెల్లం తదితర పూజలు అనంతరం అమ్మవారికి మంగళసూత్రధారణ జరిపించారు.

స్వామివారి జన్మ నక్షత్రం శ్రావణ నక్షత్రం రోజున వెంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తి విగ్ర హాలను ఆలయం అర్చకులు పట్టు వస్త్రాలతో



అలంకరణ చేసి కళ్యాణ మండపంలో అర్చ కుల పేద మంత్రాలతో కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారులు సింగరా ఆచార్యులు, కిట్టు స్వామి, అమిత్ స్వాములు కళ్యాణాన్ని నిర్వహించారు.ఆలయ గర్భగుడి నుండి ఉత్సవ మూర్తి విగ్రహాలని కళ్యాణ మండపం వద్దకు తీసుకువచ్చి కళ్యాణం నిర్వహించిన తర్వాత పల్లకిలో కూర్చోబెట్టి పూజలు చేసి వెంకటేశ్వర స్వామి కళ్యాణం ఘనంగా నిర్వహించారు.

స్వామి వారి భక్తులు పల్లకి సేవతో గోవింద నామస్మరణల మధ్య భుజాలపై పల్లకి ఆలయం చుట్టూ భక్తులు పెద్ద సంఖ్యలో ప్రత్యక్షణాలు చేస్తూ పల్లకి సేవలు వైభవంగా నిర్వహించారు.

కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

వచ్చిన భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

ఈ కళ్యాణ కార్యక్రమంలో వేముల శ్రీని వాస్ రెడ్డి, బలిజేపల్లి శ్రీనివాసులుశెట్టి, భాస్కర్, వెంకటేష్, తిరుపతి రెడ్డి, రాజేష్, వినయ్ కుమార్, మోహన్ యాదవ్ తదితరుల కుటుం బాలు కళ్యాణంలో పాల్గొన్నారు.

# నాణ్యమైన వస్త్రాలను తక్కువ ధరకు అందించడమే రామ్‌రాజ్ లక్ష్యం

**శంషాబాద్,ఆగస్టు 19(నమస్తే ఉదయం):** ప్రజలకు నాణ్యమైన వస్త్రాలను తక్కువ ధరకు అందించడమే రామ్ రాజ్ వస్త్ర సంస్థ లక్ష్యమని రామరాజు గ్రూప్ సంస్థల ఎండి నాగరాజన్ స్పష్టం చేశారు. శంషాబాద్ పట్టణంలోని మధురానగర్ రాల్లగూడ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన రామ్ రాజ్ షో రూమ్ ను టి ఎస్ ఆర్ ఫార్మా ఆలంబిక్ సి ఎఫ్ ఏ. ఏపీ. తెలంగాణ ఎండి గుండు ప్రసాద్ తో కలిసి సోమ వారం ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా నాగరాజన్ మాట్లాడుతూ 42 సంవత్సరాల క్రితం ప్రారంభించిన తమ సంస్థ అంచలంచల్గా ఎదుగుతూ 300 కు పైగా బ్రాంచి లను ఏర్పాటు చేయడం ఆనందంగా ఉన్నదని అన్నారు. సాంప్రదాయ బద్ధమైన దోవతీలను ధరించే సంప్రదాయాన్ని సజీవంగా ఉంచడం కోసం భావితరాల కోసం సంప్రదాయాన్ని కొనసాగించడమే తమ లక్షమని అన్నారు. సనాతనమైన ధర్మాన్ని ధోవతి రూపంలో అందజేయడం తమ లక్ష్యమని ఆయన వివరించారు.

దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు నిలయంగా ఉన్న శంషాబాద్‌లొ షోరూంలో ఏర్పాటు చేయడం మరింత ఆనం దాన్ని కలిగించిందని అన్నారు. తెలంగాణతో పాటు దేశంలోని



శంషాబాద్ పట్టణం మధుర నగర్‌లో రామ్ రాజ్ వస్త్రాలయాన్ని ప్రారంభిస్తున్న సంస్థ ఎం.డి.నాగరాజన్

అన్ని రాష్ట్రాల ప్రజలకు సంప్రదాయ దుస్తులపై మక్కువ కలిగే విధంగా కొత్త కొత్త డిజైన్లను రూపొందించడం జరుగుతుందని తెలిపారు. షోరూంను ప్రారంభించిన అనంతరం మొదటి లక్కీ కస్టమర్ మల్ రెడ్డి నరసింహారెడ్డి కుటుంబానికి నూతన వస్త్రాలను గుండు ప్రసాద్. నాగరాజన్ చేతుల మీదుగా అంద జేశారు.

ఈ కార్యక్రమంలో షోరూమ్ యాజమాన్యం రామకృష్ణ భూపతి తదితరులు పాల్గొన్నారు.

# బస్సులోనే ప్రసవం.. మహిళా కండక్టర్ మానవత్వం

**గద్వాల,ఆగస్టు19(నమస్తే ఉదయం):** తెలంగాణ ఆర్టీసీ బస్సులో పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణికి ఆర్టీసీ కండక్టర్ పురుడు పోసి మానవత్వం చాటుకున్నారు. గద్వాల మండలం కొండపల్లి గ్రామానికి చెందిన చెందిన సంధ్య నిండు గర్భిణి.

వనపర్తిలో ప్రభుత్వ ఆసుపత్రిలో హెల్త్ చెక్ అప్ కోసం భర్తతో కలిసి సోమవారం ఉదయం గద్వాల డిపోకు చెందిన టీఎస్ 33 టి 2543 నంబర్ గల ఆర్టీసి బస్సులో గద్వాల నుండి వనపర్తి కి బయలు దేరింది. మార్గమద్యలో వనపర్తి పట్టణానికి దాదాపు 15కి.మీ దూరంలో నాసినపల్లి గ్రామ స్టేజ్ వద్ద గర్భిణి సంధ్యకు పురిటి నొప్పులు తీవ్రమయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన కండక్టర్ జి.భారతి అప్రమత్తమై డిపో మేనేజర్ కు సమాచారం అందించారు. డీఎం సూచనల మేరకు వనపర్తిలో పని చేస్తున్న స్టాప్ నర్సు, మహిళా ప్రయాణికుల సాయంతో సాధారణ ప్రసవం చేశారు. ఆమె పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చారు.

అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 ఆంబులెన్స్‌లో వనపర్తి గవర్నమెంట్ ఆస్పత్రికి తరలించారు.

ప్రస్తుతం తల్లిబిడ్డా క్షేమంగా ఉన్నారు. బస్సులోనే కాన్పు చేసి మానవత్వం చాటుకున్న కండక్టర్ భారతీతో పాటు స్టాప్ నర్సు, మహిళా ప్రయాణికులను ఆర్టీసి ప్రయాణికులు, అధికా రులు అభినందనలు తెలియజేశారు. అప్ర మత్తమై సకాలంలో స్పందించడం వల్లే తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడంతో పాటు సేవా స్ఫూర్తిని ఆర్టీసీ సిబ్బంది చాటుతుండటం ప్రశంసనీయమని అన్నారు.





## అన్నాచెల్లెళ్ల.. అక్క తమ్ముళ్ల మధ్య అనుబంధానికి ప్రతీక రాఖీ పౌర్ణమి

**మొయినాబాద్, ఆగస్టు 19 (నమస్తే ఉదయం):** సోదర సోదరీమణులు అత్యంత పవిత్రంగా వారి బంధం పటిష్టంగా ఉండాలని జరుపుకునే రాఖీ పండుగ సందర్భంగా మండల పరిధిలోని చిలుకూరులో అడపడుచులందరు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు అన్నా చెల్లెళ్ళు అక్కాతమ్ముళ్ళ మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా జరుపుకునే రాఖీ పండుగకు ఎంతో విశిష్టత ఉందని చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ రాఖీ పండుగను జరుపుకుంటారు సోదరి తన సోదరుడికి రాఖీ కట్టి ఎప్పుడూ అన్న తనకు రక్షగా, తాను అన్నకు అండగా ఉండాలని కోరుకుంటుంది. సోదరి కట్టిన రక్షాబంధనాన్ని స్వీకరించిన అన్న తానెప్పుడూ చెల్లెలికి రక్షగా ఉంటానని రాఖీ ద్వారా తెలియజేస్తారని గుర్తుచేశారు. రాఖీ కట్టిన సోదరీమణులు అందరికి శుభాకాంక్షలు తెలియచేసారు

## అంగరంగ వైభవంగా జరిగిన ఆదిదంపతుల కళ్యాణం

**కొత్తకోట, ఆగస్ట్ 19(నమస్తే ఉదయం):** కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజి దగ్గర గల సుప్రసిద్ధమైన శైవక్షేత్రం శ్రీకోటి లింగేశ్వర దత్తదేవ స్థానములో సోమవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆదిదంపతులైన శివపార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. అర్చకులు వేదమంత్రాలతో



కన్యాదానం జరిపి మాంగల్య పూజలు చేసి వదువైన పార్వతి దేవి మెడలో వీరుడైన పరమేశ్వరుడు మాంగల్య ధారణ చేశాడు. అనంతరం ముత్తైదువులు తలంబ్రాలు పోసి వడి బియ్యం నింపారు. అనంతరం ధూపదీప నైవేద్యాలు మహామంగళహారతి సమర్పించడం జరిగింది. అనంతరం ఆలయకమిటి భక్తులకు అన్నదానం చేశారు.

## పిడుగుపడి రైతు మృతి

**గద్వాల,ఆగస్టు19(నమస్తే ఉదయం):** జిల్లాలోని గట్టు మండలంలోని ఆరగిద్ద గ్రామానికి చెందిన బోయ నల్లారెడ్డి (32) పిడుగుపాటుకు మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆరగిద్ద గ్రామానికి చెందిన బోయ నల్లారెడ్డి గ్రామ శివారులో గల తన వ్యవసాయ భూమిలో పత్తిపంటకు నీళ్ల పారబెడుతుండగా సోమవారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో పిడుగుపాటుకు అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య కుమా రుడు, కూతురు ఉన్నారు.



## స్వామీ వారిని దర్శించుకున్న కాంగ్రెస్ నాయకులు

**గద్వాల,ఆగస్టు19(నమస్తే ఉదయం):** గట్టు మండలం ఇందువాసి గ్రామంలో శ్రీశ్రీశ్రీ వీరభద్రేశ్వర స్వామి నూతన దేవాలయ ప్రారంభోత్సవ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, మాజీ జెడ్పీటిసి పద్మావెంకటేశ్వర రెడ్డి వీరభద్రేశ్వస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.





మాజీ మున్సిపల్ చైర్మన్ జి వేణుగోపాల్‌కు రాఖీ కడుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి



మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం కృష్ణారెడ్డికి రాఖీ కడుతున్న జ్యోతి



సీనియర్ జర్నలిస్టు చుక్క సుదర్శన్ రెడ్డికి రాఖీ కడుతున్న సోదరి



అన్నయ్యకు రాఖీ కడుతున్న చిన్నారి

# గద్వాలలో ఘనంగా రాఖీ పౌర్ణమి

### నాయకులు, కార్యకర్తలకు రాఖీ కట్టిన మాజీ జడ్పీ చైర్మన్ సరిత, ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి సతీమణి జ్యోతి

**గద్వాల,ఆగస్టు19(నమస్తే ఉదయం):** అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పౌర్ణమి వేడుకలు సోమవారం జోగుళాంబ గద్వాల్ జిల్లాలో ఘనంగా జరిగాయి. పుట్టింటి నుంచి మెట్టినింటికి వెళ్లిన చెల్లెళ్లు అన్నలకు, తమ్ముళ్లకు రాఖీలు కట్టి ఈ బంధం జన్మజన్మలు కొనసాగాలని ఆశీర్వాదం పొందారు. రాఖీ కట్టిన అక్కాచెల్లెళ్లకు చీరలు ఇచ్చి ఒడి బియ్యం పోసి సంతోషంగా ఉండాలని దీవించారు. చిన్నారులు కూడా ఒక రికొక్కరు రాఖీని కట్టుకొని తమ అనుబంధాన్ని చాటారు. జిల్లా వ్యాప్తంగా ప్రసిద్ధ ఆలయాలలో రాఖీపౌర్ణమి సందర్భంగా స్వామీ వారికి ప్రత్యేక పూజలు చేశారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో గద్వాల ఎమ్మెల్యే నివాసంనందు రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి తన సోదరులులకు, నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ జి వేణుగోపాల్, గడ్డం కృష్ణా రెడ్డి, పటేల్ ప్రభాకర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి,శ్రీధర్ గౌడ్, రాజశేఖర్, విజయ్ కుమార్, రమేష్ నాయుడు, నాయకులకు, కార్యకర్తలకు రాఖీ కట్టి ఆశీర్వాదం పొందారు. అదే విధంగా మాజీ జెడ్పీ చైర్ పర్సన్ సరిత నివాసంలో కౌన్సిలర్లకు, నాయకులకు, కార్యకర్తలకు రాఖీ కట్టారు. సందర్భంగా వారు మాట్లాడుతూ అక్కాతమ్ముళ్ల, అన్నాచెల్లెళ్ల అనుబందానికి ప్రతీక ఈ రక్షా బందన్ అన్నారు. ఈ మంచి అనుబంధాన్ని, ఆప్యాయతల పర్వదినం ప్రతి ఒక్కరిలో ఆనందం నింపాలన్నారు. ఈ పండుగను అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్యన ప్రేమానురాగాలకు సూచకం అన్నారు.





ప్రజాప్రతినిధులు, నాయకులకు రాఖీ కట్టిన జడ్పీ మాజీ చైర్మన్ సరిత, అన్నయ్యకు రాఖీ కడుతున్న సోదరి

# టెక్కలయ్య దర్గా వద్ద..సిసి రోడ్డు పనులకు భూమి పూజ

**కొత్తకోట, ఆగస్టు19(నమస్తే ఉదయం):** కొత్తకోట మున్సిపల్ కేంద్రంలోని ఒకటవ వార్డు పరిధిలోగల టెక్కలయ్య దర్గా ఆవరణలో మున్సిపల్ నిధుల నుండి మున్సిపల్ చైర్మన్‌పొగాకు సుఖేషిని విశ్వేశ్వర్ సీసీ రోడ్డుకు నిధులు మంజూరు చేశారు. ఈ పనులకు మాజీ జడ్పీటీసీ పొగాకు విశ్వేశ్వర్ తో పాటు మున్సిపల్ ఏఈ ప్రశాంత్..మున్సిపల్ కౌన్సిలర్లు కొండారెడ్డి, రామ్మోహన్ రెడ్డి,ఖాజా మైనోద్దిన్,పద్మ అయ్యన్న,ఓల్లమన్ తిరుపతయ్య,హొటల్ రాములు యాదవ్,కో ఆప్షన్ సభ్యులు వసీం ఖాన్,తహెసీన్ వహీద్ అలీలు పాల్గొని సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేసి శ్రీకారం చుట్టారు.

ఈనెల 25 నుండి టెక్కలయ్య దర్గా ఉర్సు ఉత్సవాలు ప్రారంభం కానుండడంతో పనులకు భక్తుల సౌకర్యార్థం దర్గా పీఠాధిపతుల విన్నపం మేరకు మున్సిపల్ చైర్మన్ పొగాకు సుఖే షిణి విశ్వేశ్వర్ మున్సిపల్ నిధులు మంజూరు చేశారు.. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతులు వహీద్ మౌలానా ఖాద్రి..పీర్ పాషా ఖాద్రిలు దర్గాలో ప్రత్యేక ప్రార్థన నిర్వహించి..దర్గా ఆవరణలో ఫాతేహ సమర్పించి.. నిధులు మంజూరు చేసిన మున్సిపల్ ఛైర్మెన్ పొగాకు సు ఖే షి ని విశ్వేశ్వర్‌కి.. సహకరించిన పాలకమండలి సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు ఎండి రజియోద్దిన్, బి ఆర్ ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎండి తాహెర్ బాబా,దర్గా కార్యవర్గ సభ్యులు అజీమొద్దిన్ ఖాద్రి,ఖదీర్ ఖాద్రి, బి ఆర్ ఎస్ పార్టీ మైనారిటీ పట్టణ ఉపాధ్యక్షులు మజీద్ ఖాన్,15వ వార్డు యూత్ అధ్యక్షులు ఎండి సాదిక్,పట్టణ మైనారిటీ ప్రధాన కార్యదర్శి ఎండి షకీల్,14వ వార్డు ఉపాధ్యక్షులు జపాన్ తదితరులు పాల్గొన్నారు.



దర్గా వద్ద రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మాజీ జెడ్‌పిటిసి పొగాకు విశ్వేశ్వర్

# ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

**గద్వాల,ఆగస్టు19(నమస్తే ఉదయం):** ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని పెంపొందించుకొని ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గట్టు మండలం ఇందువాసి గ్రామంలోని నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ శ్రీ వీరభద్రేశ్వర స్వామి నూతన దేవస్థానం ప్రారంభోత్సవం సోమవారం కన్నుల పండుగగా జరిగింది. ఇందులో భాగంగా స్వామివారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని పీఠాదిపతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ... భక్తి భావంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ శాఖ మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడ, మాజీ జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి పటేల్ ప్రభాకర్ రెడ్డి, రమేష్ నాయుడు, శ్రీధర్ గౌడ్, జి.వేణుగోపాల్, సత్యం రెడ్డి విక్రమ్ సింహారెడ్డి, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ జెడ్పిటిసిలు రాజశేఖర్, పద్మ వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, నాయకులు ఆనంద్ గౌడు,బసవరాజు గౌడ్, నర్సింహులు , రాముడు , డి.ఆర్ విజయ్, శ్రీరాములు, బజారి , మోహన్ గౌడు, సంతోష్, రామకృష్ణ నాయుడు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

### స్వామీ వారిని దర్శించుకున్న బీఆర్ఎస్ నాయకులు

ఇందువాసి గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ వీరభద్రేశ్వర స్వామి నూతన దేవాలయ ప్రారంభోత్సవ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు బాసు హనుమంతు నాయుడు, బీఆర్ఎస్ నాయకులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారిని దేవాలయ కమిటీ సభ్యులు బాసు హనుమంతు నాయుడు ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బస్వరాజు గౌడ్,మాజీ సర్పంచ్ వీరేష్ గౌడ్,మాజీ గ్రంథాలయ చైర్మన్ జంబు రామన్ గౌడ్,అంగడి బస్వరాజు,ఎస్ రాము, రాజు నాయుడు,మాజీ ఎంపీటీసీ కిష్టప్ప,బాసు బొజ్జయ్య, తిమ్మప్ప, గట్టు సాయి కుమార్,రామన్ గౌడ్,జామన్న,తుమ్మలపల్లి మద్దిలేటి, నర్సప్ప, డాక్టర్ రాజు,గురుపద నాయుడు,మేకల తిమ్మప్ప,మరియు పార్టీ నాయకులు,కార్యకర్తలు, ఆలయ కమిటీ తదితరులు పాల్గొన్నారు...

## ఘనంగా పూజా రెడ్డి, అచ్యుత్ రెడ్డిల వివాహం

**నూతన వధూవరులను ఆశీర్వదించిన పెద్దలు - నర్కుడ సుకన్య ఫామ్స్‌లో ఘనంగా వివాహం**

**శంషాబాద్, ఆగస్టు19 (నమస్తే ఉదయం):** ఎం ఎస్ ఎన్ గ్రూప్ చైర్మన్ మన్నె సత్యనారాయణ రెడ్డి కుమారుడు అచ్యుత్ రెడ్డి వివాహం పూజా రెడ్డి తో శంషాబాద్ మండలంలోని నర్కూడలోని సుకన్య ఫామ్స్‌లో ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. మహబూబ్ నగర్ మాజీ పార్లమెంట్ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ఢిల్లీ ప్రతినిధి, తెలంగాణ రాష్ట్ర క్రీడా వ్యవహారాల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి బంధువైన కొండారెడ్డి రవీందర్ రెడ్డి కూతురు పూజా రెడ్డి, అచ్యుత రెడ్డిల వివా హానికి రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, బంధువులు పెద్ద మొత్తంలో హాజరై నూతన వధూ వరులను ఆశీర్వదించారు. కొత్తకోట మండలం రామకృష్ణాపురం గ్రామం మాజీ సర్పంచ్, సీనియర్ నాయకులు మూలమల్ల భీమ్ రెడ్డి వివాహానికి హాజరై అచ్యుత్ రెడ్డి, పూజా రెడ్డి నూతన వధూ వరులను ఆశీర్వదించారు.



## సోదరీమణుల ప్రేమ దేవుని ఆశీర్వాదంతో సమానం

**రాజేంద్రనగర్, ఆగస్టు19 (నమస్తే ఉదయం):** మైలార్‌దేవ్‌పల్లిలోని రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ నివాసంలో ప్రజాపిత బ్రహ్మ కుమారి సోదరీమణులు సోమవారం రక్ష బందన్ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కు రాఖి కట్టారు. ఈ సందర్భంగా బ్రహ్మ కుమారీలు మాట్లాడుతూ, సోదరిమణుల ప్రేమ దేవుడి ఆశీర్వాదం కంటే తక్కువేమీ కాదన్నారు. దుఃఖానికి తావులేని బంధం.... దూరం విడదీయలేని అనుబంధం అన్నా చెల్లెళ్ళ అనుబందమన్నారు. ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, మీకు నేను రక్ష ....నాకు మీరు రక్ష ....మనమందరం దేశానికి, ధర్మానికి రక్ష అని గుర్తు చేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలందరికి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.



రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మ కుమారీలు


Printed and Published MEKALA DAMODAR REDDY on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. Editor: M.Damodhar Reddy. “RNI. Title- Code: TELTEL/2023/87699. Cell: 9492148733